## బడిపిల్లలకు పస్తులు లేని విద్య

● నీట్ వంటి అడ్డంకులొచ్చినా అండగా ఉంటాం

● సీఎం స్టాలిన్ ● అల్పాహార విస్తరణ పథకం ప్రారంభం



చిన్నారులకు అల్పాహారం వడ్డిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల నుంచి ప్రశంసలందుకుంటున్న ద్రావిడ తరహా పాలనలో రాష్ట్రానికి చెందిన బడి పిల్లలకు పస్తుల్లేని విద్య అందిస్తామని, నీట్, కేంద్ర ప్రభుత్వ నూతన విద్యావిధానం వంటి ఎన్ని అడ్డంకులు ఎదురైనా వారికి అండగా ఉంటామని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. తిరువళ్లూరు జిల్లా కీళ్చ్చేరి సెయింట్ అన్నాల్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో బడిపిల్లల అల్పాహార విస్తరణ పథకానికి ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లోనూ ముఖ్యమంత్రి అల్పాహార పథకం విస్తరణ తన చేతుల మీదుగా నిర్వహించడం తనకెంతో సంతోషాన్ని కలిగిస్తోందని చెప్పారు. 'ముఖ్యమంత్రి బడిపిల్లల అల్పాహార పథకం', 'నాన్ ముదల్వన్', 'పుదు మైపెణ్', 'కలైంజర్ మహిళా సాధికారిక నగదు పంపిణీ పథకం' మహిళలు, బడిపిల్లలు, పాఠశాల, కళాశాలల విద్యార్థులు, యువకులకు మంచి భవిష్యత్ అందించడం కోసం తాను రూపొందించిన పథకాలు సత్ఫలితాలనిస్తున్నాయన్నారు. చెన్నైలో ఓ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంలో అక్కడ చదువుతున్న బాలిక తానింకా టిఫిన్ చేయలేదని చెప్పినప్పుడు చాలా బాధపడ్డానని, అప్పటికప్పుడు బడిపిల్లల ఆకలి తీర్చాలని నిర్ణయించి ప్రకటించినదే బడిపిల్లల అల్పాహార పథకమని గుర్తు చేశారు. రెండేళ్ల క్రితం దివంగత మాజీ సీఎం అన్నాదురై జయంతి రోజున ఈ పథకాన్ని ప్రారంభించానని, ప్రస్తుతం మరో మాజీ ముఖ్యమంత్రి కామరాజర్ జయంతి రోజున ఈ పథకాన్ని ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలకు విస్తరింపజేస్తున్నానని సభికుల హర్షధ్వానాల నడుమ పేర్కొన్నారు. అల్పాహార పథకం ప్రభుత్వ బడులకేనా, తమకు అమలు చేయారా అంటూ ప్రభుత్వ సాయం పొందుతున్న పాఠశాలల్లో చదివే చిన్నారులకు అడిగారని, దానికి సమాధానంగానే సుమారు 18.5లక్షలకు పైగా ప్రభుత్వ పాఠశాలల చిన్నారుల అల్పాహార పథకాన్ని విస్తరింపజేశానని చెప్పారు. ఈ పథకం విస్తరణతో రాష్ట్రమంతటా రోజూ 20.73 లక్షల మందికి పైగా బడిపిల్లలు రుచికరమైన అల్పాహారం తింటున్నారని తెలిపారు. పురనానూరు, తిరుక్కురళ్, మణిమేఘలై వంటి ప్రాచీన సాహిత్యాల్లో ఆకలిని పారద్రోలాలని పిలుపునిచ్చాయని, అంతే కాకుండా అవ్వయార్, వళ్లలార్ వంటి ఆధ్యాత్మికవేత్తలు సైతం ప్రతి జీవి ఆకలి తీర్చటమే మానవుల కర్తవ్యమంటూ ఎలుగెత్తి చాటారని గుర్తు చేశారు. ఈ పథకం తల్లిదండ్రుల ఆర్థిక భారం తగ్గుతుందని, పాఠశాలలకు వచ్చే విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతుందన్నారు. అల్పాహార పథకం ద్వారా లబ్ధిపొందుతున్న ఓ చిన్నారి టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆ బాలిక తల్లిదండ్రులు రోజూ ఉద్యోగానికి వెళుతుంటారని, ఉదయం అల్పాహారం చేయలేరని, ఆ పరిస్థితులలో ప్రభుత్వం అందజేస్తున్న అల్పాహారం తన ఆకలిని తీరుస్తోందంటూ చెప్పిన మాటలు తనకు ఎంతో సంతృప్తి కలిగించాయన్నారు. అల్పాహార పథకంపై ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని, వారి స్వస్థలాల్లో ఉన్న బడుల్లో రుచికరమైన శుచికరమైన వాతావరణంలో అల్పాహారం అందిస్తున్నారా అని నిఘా వేయాలని ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు.



అల్పాహారాన్ని రుచి చూస్తున్న స్టాలిన్



బాలికకు అల్పాహారం తినిపిస్తున్న సీఎం


### చదువుపైనే దృష్టిసారించండి...

బడిపిల్లల నుంచి కళాశాలల విద్యార్థుల వరకు తమ ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పించేందుకు సిద్ధంగా ఉందని, కనుక విద్యార్థులు చదువుపైనే దృష్టిసారించాలని స్టాలిన్ పిలుపునిచ్చారు. చదువు అనే సంపదను ఎవరూ అపహరించలేరని, ఆ చదువే అందరినీ ఉన్నత స్థితికి తీసుకెళ్తుందని చెప్పారు. నీట్‌కు వ్యతిరేకంగా తమ ప్రభుత్వం రాజకీయపరంగా, న్యాయపరంగా పోరాడుతూనే ఉంటుందన్నారు. గతంలా విద్యను రాష్ట్ర జాబితాలోకి తీసుకొచ్చేందుకు కూడా ముమ్మరంగా ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, కాంగ్రెస్ ఎంపీ శశికాంత్ సెంథిల్, ఎమ్మెల్యేలు వీజీ రాజేంద్రన్, చంద్రన్, ఇనికో ఇరుదయరాజ్, రాష్ట్ర పాఠ్యపుస్తకాల సంస్థ అధ్యక్షులు లియోని, ప్రభుత్వ కార్యదర్శి జయశ్రీ మురళీధరన్, తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ ప్రభుశంకర్, సెయింట్ అన్నాల్ సభ అధ్యక్షురాలు సిస్టర్ క్లారా వసంతి, పాఠశాల హెచ్ఎం సిస్టర్ బబితా మేరీ జెనిఫర్ తదితరులు పాల్గొన్నారు.

నీట్‌ను ముందుగా వ్యతిరేకించింది డీఎంకే ప్రభుత్వమేనని, ప్రస్తుతం ఆ పరీక్షల నిర్వహణలో జరిగిన అవినీతి అక్రమాలను చూసి పలు రాష్ట్రాలు నీట్‌ను వ్యతిరేకిస్తున్నాయన్నారు. అంతేకాకుండా నీట్ నిర్వహణలో అవకతవకలపై సుప్రీంకోర్టు సైతం కేంద్ర ప్రభుత్వాన్ని తూర్పారబట్టిందన్నారు.

### నా పేరు స్టాలిన్ తాత కాదు...

అల్పాహార పథకాన్ని ప్రారంభించిన సీఎం.. చిన్నారులతో ముచ్చటించారు. ఓ బాలిక వద్దకు వెళ్లి 'నా పేరేమిటో తెలుసా?' అని అడగ్గా.. 'మీ పేరు స్టాలిన్ తాత కదా!' అని బాలిక నవ్వుతూ బదులిచ్చింది. వెంటనే 'నా పేరు స్టాలిన్ తాత కాదు... స్టాలిన్ మాత్రమే' అంటూ ముఖ్యమంత్రి చిరునవ్వులు చిందించారు.



### కావేరి జలాల వివాదం...

## కర్ణాటక సర్కారు తీరును ఖండిస్తూ నేడు అఖిలపక్ష సమావేశం

చెన్నై, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కావేరీ జలాల విడుదల విషయంలో మొండిగా వ్యవహరిస్తున్న కర్ణాటక ప్రభుత్వ వైఖరిపై చర్చించేందుకు మంగళవారం అఖిలపక్షం భేటీ కానుంది. సీఎం స్టాలిన్ ఆదేశాల మేరకు నీటివనరుల శాఖ మంత్రి దురైమురుగన్.. ఈ మేరకు ఏర్పాట్లు చేపట్టారు. కావేరి నిర్వాహక మండలి ఉత్తర్వుల మేరకు కర్ణాటక నుంచి కావేరి జలాలు పొందటానికి చేపట్టాల్సిన అత్యవసర చర్యలపై సమగ్రంగా చర్చించి, నిర్ణయం తీసుకునేందుకు వీలుగా శాసనసభలోని వివిధ పార్టీల సభాపక్షనేతల సమావేశం సోమవారం జరుగుతుందని ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. కావేరి ట్రిబ్యునల్ 2007 ఫిబ్రవరి 5న ఇచ్చిన తుది తీర్పు ప్రకారం, అదే విధంగా సుప్రీంకోర్టు 2018 ఫిబ్రవరి 16న వెలువరించిన తీర్పు అమలు చేసేందుకు కావేరి జలాల నియంత్రణ కమిటీ (సీడబ్ల్యూఆర్‌సీ), కావేరి జలాల నిర్వాహక మండలి (సీడబ్ల్యూఎంఏ) అనే రెండు సంస్థలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ మేరకు 2018 జూన్ నుంచి ఈ రెండు సంస్థలు కావేరి జలాల విడుదలకు సంబంధించిన వ్యవహారాలను నిర్వర్తిస్తున్నాయి. ఈ తీర్పుల ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన కావేరి జలాలను గత యేడాది కర్ణాటక ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో డెల్టా రైతులు సాగునీరు అందక తీవ్రంగా నష్టపోవడంతో సుప్రీం కోర్టును ఆశ్రయించి కావేరి జలాలను పొందింది. ప్రస్తుతం కర్ణాటకలోని జలాశయాల పరీవాహక ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురవటంతో డ్యాంలు జలకళ సంతరించుకున్నాయి.

ఈ పరిస్థితుల్లో కావేరి జలాల నియంత్రణ కమిటీ (సీడబ్ల్యూఆర్‌సీ), కావేరి జలాల నిర్వాహక మండలి (సీడబ్ల్యూఎంఏ) సంస్థ రాష్ట్రానికి బిలిగుండ్లు ప్రాంతానికి రావాల్సిన జలాలను గణించి ఈ నెల 12న నుంచి 31 వరకు రోజుకు ఒక టీఎంసీ చొప్పున జలాలను విడుదల చేయాలని కావేరి జల నియంత్రణ కమిటీ (సీడబ్ల్యూఆర్‌సీ)ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పరిస్థితుల్లో కావేరి డెల్టా జిల్లాల సాగుకు జలాలను విడుదల చేసే ప్రసక్తే లేదంటూ కర్ణాటక ప్రభుత్వం ప్రకటించింది. దీనిని తమిళనాడు సీఎం స్టాలిన్ తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రస్తుతం కర్ణాటకలోని ప్రధానమైన నాలుగు జలాశయాల్లో 75.586 టీఎంసీల మేరకు జలాలున్నాయని, భారత వాతావరణ శాఖ సూచలన మేరకు ఆ రాష్ట్రంలో రాబోవు రోజుల్లో కుండపోత వర్షాలు కురుస్తాయని కూడా ప్రకటించిందని, అలాంటి పరిస్థితుల్లో కావేరి జలాలను విడుదల చేయబోమని కర్ణాటక ప్రభుత్వం ప్రకటించడం సుప్రీం కోర్టు ఉత్తర్వులకు వ్యతిరేకమని తెలిపారు. ఈ పరిస్థితుల్లోనే కావేరి జలాలను విడుదల చేయకుండా మొండి వైఖరిని అవలంబిస్తున్న కర్ణాటక ప్రభుత్వ తీరు ఖండిస్తూ మంగళవారం ఉదయం 11 గంటలకు శాసనసభలో అన్ని పార్టీల సభాపక్షనాయకుల సమావేశం ఏర్పాటు చేయాలని మంత్రి దురైమురుగన్‌ను ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఆ మేరకు దురైమురుగన్ నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం జరుగనుంది.

## రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపు

### ఈనెల 1 నుంచి అమలు

చెన్నై, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ చార్జీలను పెంచుతూ తమిళనాడు విద్యుత్ క్రమబద్ధీకరణ కమిషన్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం గృహ విద్యుత్ కనెక్షన్లలో 400 యూనిట్ల వరకు చార్జీలు పెంచలేదు. ఆపై నమోదయ్యే యూనిట్లకు చార్జీలు పెంపు వర్తిస్తుందని రెగ్యులేటరీ కమిషన్ పేర్కొంది.

### పెరిగిన చార్జీల వివరాలిలా....

401 యూనిట్లనుంచి 500 యూనిట్ల వరకు ప్రస్తుతం రూ.6.15 వసూలు చేస్తుండగా రూ.6.45కి పెంచారు. అదే విధంగా 501 నుంచి 600 యూనిట్ల వరకు ప్రస్తుతం రూ.8.15 వసూలు చేస్తుండగా దానిని రూ.8.55కి పెంచారు. 601 నుంచి 800 యూనిట్ల వరకు ఇప్పటి వరకు రూ.9.20 వసూలు చేస్తుండగా రూ.9.64 పైసలకు పెంచారు. చార్జీల పెంపుదల జూలై 1 తేదీ నుంచే అమలవుతుందని రెగ్యులేటరీ కమిషన్ వెల్లడించింది.

## కోలాహలంగా కామరాజర్ జయంతి

నివాళులర్పించిన ప్రభుత్వం, రాజకీయ పార్టీలు



కామరాజర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్ తదితరులు

ప్యారీస్, జూలై 15: దివంగత మాజీ ముఖ్యమంత్రి కామరాజర్ 122వ జయంతి సందర్భంగా సోమవారం రాష్ట్రవ్యాప్తంగా వేడుకలు కోలాహలంగా జరుపుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, రాజకీయ పార్టీల కార్యాలయాల్లో సందడి నెలకొంది. రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి గిండిలోని రాజ్‌భవన్‌లో ఏర్పాటుచేసిన కామరాజర్ చిత్రపటానికి నివాళులర్పించారు. తిరువళ్లూర్ జిల్లా కడంబత్తూర్ పాఠశాలలో కామరాజర్‌కు ముఖ్యమంత్రి స్టాలిన్ నివాళులర్పించారు. రాష్ట్రంలో విద్యా విప్లవాన్ని సృష్టించిన కామరాజర్ విరుదునగర్‌లో కుమరస్వామి-శివగామి దంపతులకు 1903 జూలై 15వ తేది జన్మించారు. ఆయన 1954 నుంచి 1963వ సంవత్సరం వరకు ముఖ్యమంత్రిగా వ్యవహరించి అన్ని ప్రభుత్వ శాఖల అభివృద్ధికి కృషిచేశారు. కాంగ్రెస్ పార్టీలో కీలక పదవులు వహించి పలువురిని ప్రధానులుగా ఎంపిక చేసి కింగ్ మేకర్‌గా గుర్తింపు పొందారు. తొమ్మిదేళ్లుగా సీఎంగా వ్యవహరించిన ఆయన యువతకు రాజకీయాల్లో అవకాశం కల్పించాలన్న ఉద్దేశంతో ఎన్నికల్లో పోటీచేయలేదు. నిరాడంబరంగా జీవించిన కామరాజర్‌కు కేంద్ర ప్రభుత్వం 1976లో భారతరత్న అవార్డు తో గౌరవించింది. 2006లో అప్పటి ముఖ్యమంత్రి కరుణానిధి జూలై 15వ తేదీ విద్యాభివృద్ధి దినంగా ప్రకటించారు. అప్పటి నుంచి ఏటా కామరాజర్ జయంతిని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో వేడుకగా జరుపుకుంటున్నారు. అన్నాసాలై జింఖానా క్లబ్ సమీపంలోని కామరాజర్ విగ్రహానికి రాష్ట్రప్రభుత్వం తరఫున మంత్రులు అనితా రాధాకృష్ణన్, పీకే శేఖర్‌బాబు, ఎమ్మెల్యేలు ప్రభాకర్ రాజా, వేలు, నగర మేయర్ ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, ప్రభుత్వ అధికారులు నివాళులర్పించారు. టి.నగర్ తిరుమలపిళ్లై వీధిలో ఉన్న కామరాజర్ స్మారక గృహంలో ఉన్న ఆయన విగ్రహానికి పలు రాజకీయ పార్టీల నేతలు నివాళులర్పించారు. రాయపేటలోని టీఎన్‌సీసీ ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో పూలతో అలంకరించిన కామరాజర్ చిత్రపటానికి ఎమ్మెల్యే సెల్వపెరుందగై, ఎంపీ ఎస్.తిరునావుక్కరసర్ తదితరులు నివాళులర్పించారు. తమిళ మానిల కాంగ్రెస్ ఆధ్వర్యంలో తిరుచ్చిలో జరిగిన వేడుకల్లో కామరాజర్ చిత్రపటానికి ఆ పార్టీ అధ్యక్షుడు జీకే వాసన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, పీఎంకే రాష్ట్ర అధ్యక్షుడు అన్బుమణి రాందాస్, ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్, టీఎంసీ నిర్వాహకులు జీఆర్ వెంకటేష్, విడియల్ శేఖర్ తదితరులు నివాళులర్పించారు. విరుదునగర్‌లోని కామరాజర్ స్మారక స్థలంలో జిల్లా కలెక్టర్ జయశీలన్ పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. డీఆర్వో రాజేంద్రన్, ఎస్పీ ఫిరోజ్‌ఖాన్ అబ్దుల్లా, రాష్ట్ర మంత్రులు సాతూర్ రామచంద్రన్, తంగం తెన్నరసు, ఎమ్మెల్యేలు, ఎంపీలు నివాళులర్పించారు. కోయంబేడులోని డీఎండీకే కార్యాలయంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత విజయకాంత్, జింఖానా క్లబ్ సమీపంలోని కామరాజర్ విగ్రహానికి బీజేపీ తరఫున సీనియర్ నేత తమిళిసై సౌందర్‌రాజన్, కరు నాగరాజన్, కరాటే త్యాగరాజన్ తదితరులు నివాళులర్పించారు. అలాగే, అన్నాడీఎంకే తరఫున మాజీ మంత్రులు డి.జయకుమార్, వలర్మతి, జిల్లా కార్యదర్శులు బాలగంగా, ఇన్బదురై, రాయపురం మనో, జయవర్ధన్‌లు నివాళులర్పించారు.



తిరుచ్చిలో బీజేపీ, అమ్మా మక్కల్ మున్నేత్ర కళగం నేతలతో కలిసి నివాళులర్పిస్తున్న టీఎంసీ అధినేత జీకే వాసన్

## ఒకే కుటుంబంలో ముగ్గురి హత్య

● హతమార్చి, నిప్పంటించిన దుండగులు

● కడలూరుజిల్లాలో ఘోరం

చెన్నై, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లాలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు హత్యకు గురయ్యారు. గుర్తు తెలియని వ్యక్తులు ముగ్గురినీ హతమార్చి, ఆనక వారి శవాలకు నిప్పంటించారు. ఓ ఇంట్లో దుర్గంధం రావడం గమనించిన చుట్టుపక్కల వారు... పోలీసులకు సమాచారం ఇవ్వగా, విషయం వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ... కడలూరు జిల్లా కారామణికుప్పం ప్రాంతానికి చెందిన కమలీశ్వరి (60) అనే వితంతువుకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు సురేంద్రకుమార్ (42) కాకినాడలో ఉండగా, రెండో కుమారుడు సుగంధకుమార్ (40) హైదరాబాద్‌లో ఐటీ సంస్థలో పనిచేస్తున్నాడు. పది రోజుల క్రితం సుగంధకుమార్ తన తొమ్మిదేళ్ల కుమారుడు నిశాంత్‌కుమార్‌తో కారామణికుప్పం వచ్చాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం కమలీశ్వరి నుంచి దుర్వాసన రావటంతో చుట్టుపక్కల వారు నెల్లికుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇంటి తాళం పగులగొట్టి లోపలకు వెళ్ళి చూడగా.. వేర్వేరు గదుల్లో కమలీశ్వరి, ఆమె కుమారుడు సుగంధకుమార్, మనవడు నిశాంత్‌కుమార్ వళ్లంతా కాలి శవాలుగా పడి వున్నారు. ఆ గదుల్లో అక్కడక్కడా రక్తపు మరకలు ఉండటంతో ఆ ముగ్గురినీ గుర్తు తెలియని వ్యక్తులు హత్యచేసి నిప్పంటించి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఇలా తాళం వేసిన ఇంటిలో శవాలుగా లభించడంతో కారామణికుప్పంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. నెల్లికుప్పం పోలీసులు మృతదేహాలను కడలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి హంతకుల ఆచూకీ కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.



మృతులు (ఫైల్ ఫొటో). ఇంటి వద్ద గుమికూడిన పోలీసులు, స్థానికులు

## హస్తిన వెళ్లిన గవర్నర్

### ఐదు రోజులు అక్కడే

అడయార్, జూలై 15: రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి సోమవారం ఢిల్లీకి బయలుదేరివెళ్లారు. ఆయన ఐదు రోజుల పాటు అక్కడే ఉండనున్నారు. సోమవారం ఉదయం గిండీలోని గాంధీ మండపంలో మాజీ సీఎం కామరాజర్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించిన అనంతరం 11.25 గంటలకు చెన్నై నుంచి విమానంలో ఢిల్లీ వెళ్లారు. ఆయన వెంట వ్యక్తిగత కార్యదర్శి, భద్రతా అధికారి కూడా ఉన్నారు. ఈ ఐదు రోజుల పర్యటనలో భాగంగా ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో పాటు మరికొందరు కేంద్రమంత్రులను కలిసే అవకాశాలున్నాయి. నిజానికి మోదీ మూడో సారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన ఒకసారి ఢిల్లీకి వెళ్లినా ప్రధానిని కలవలేదు. కానీ, ఈ పర్యటనలో మాత్రం ప్రధానిని కలిసి వివిధ అంశాలపై చర్చించే అవకాశమున్నట్టు వార్తలు వస్తున్నాయి.



గిండి గాంధీమండపంలో కామరాజర్ చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

# ఎడిడెడ్ పాఠశాల విద్యార్థులకు అల్పాహారం

● మంత్రి దురైమురుగన్

వేలూరు, జూలై 15: రాష్ట్రవ్యాప్తంగా ఎయిడెడ్ పాఠశాల విద్యార్థులకు ఉదయం అల్పాహార పథకం సోమవారం ప్రారంభమైన నేపథ్యంలో కాట్పాడి యూనియన్ నిధుల సహాయం పొందే క్రిస్టియన్‌పేట పాఠశాలలో మంత్రి దురైమురుగన్ దీనిని ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి, గ్రామీణాభివృద్ధి పథక డైరెక్టర్ ఆర్తి, తమిళనాడు గ్రామీణ జీవనాధార సమాఖ్య పథక డైరెక్టర్ నాగరాజన్, యూనియన్ కమిటీ అధ్యక్షుడు వేల్‌మురుగన్, ఉప మేయర్ సునీల్‌కుమార్, 1 మండల కమిటీ అధ్యక్షురాలు పుష్పలత వన్నియరాజా, జిల్లా పంచాయతీల కమిటీ సభ్యుడు సులోచన కృపాకరన్, యూనియన్ కమిటీ సభ్యులు గాంధీమతి, జిల్లా ప్రధాన విద్యాధికారి మణిమొళి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కాట్పాడి యూనియన్ బ్రహ్మపురం పంచాయతీలో రూ.13.16 లక్షలతో నిర్మించిన రేషన్ దుకాణాన్ని మంత్రి ప్రారంభించారు. అలాగే, బ్రహ్మపురం పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో 'కలైంజర్ కనవు పథకం'లో 605 మంది లబ్దిదారులకు ఇంటి నిర్మాణ ఉత్తర్వులను మంత్రి అందజేశారు.



క్రిస్టియన్‌పేట ఎయిడెడ్ పాఠశాలలో అల్పాహారం పథకం ప్రారంభిస్తున్న మంత్రి దురైమురుగన్

# కుంభాభిషేకం ఫ్లెక్సీ చింపివేత

**ఇరువర్గాల బాహాబాహీ**



రాస్తారోకో చేపట్టిన ప్రజలు (పక్క చిత్రంలో) పోలీసు బందోబస్తు

పెరంబూర్, జూలై 15: ఆలయ కుంభాభిషేకం ఫ్లెక్సీ చింపివేసిన ఘటన కరూర్ సమీపంలో ఉద్రిక్తతకు దారితీసింది. కరూర్ జిల్లా కుళిత్తలై సమీపం పొయ్యామణి అంబేడ్కర్ మారియమ్మన్ ఆలయ కుంభాభిషేకం ఈ నెల 12వ తేది జరిగింది. కుంభాభిషేకం సందర్భంగా ఆ ప్రాంతానికి చెందిన కొందరు యువకులు ఫ్లెక్సీ ఏర్పాటుచేశారు. శనివారం రాత్రి ఈ ఫ్లెక్సీని ఎవరో చింపివేశారు. మరో వర్గం వారు ఫ్లెక్సీ చింపివేశారని ఆరోపించిన నేపథ్యంలో, ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. పోలీసు అధికారులు, గ్రామ పెద్దలు, ఆలయ నిర్వాహకులు చర్చలు జరిపి, ఇకపై బహిరంగ ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటుచేయరాదని, ఘర్షణలు జరిగేలా వ్యవహరించరాదని ఇరుతరఫు వారిని సూచించారు. ఈ నేపథ్యంలో, ఆదివారం ఫ్లెక్సీ ఏర్పాటుచేసిన ప్రాంతాల్లో ఇరువర్గాల పరస్పర దాడులకు పాల్పడ్డారు. అక్కడ ఉన్న పోలీసులు వారిని ఆపేందుకు యత్నించినా సాధ్యం కాకపోగా, ఇరువర్గాల వారు కర్రలు, రాళ్ల దాడులకు పాల్పడ్డాడు. సమాచారం అందుకొని అక్కడకు చేరుకున్న ప్రత్యేక బలగాలు ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అదే సమయంలో తమపై దాడిచేసిన వారిని అరెస్ట్ చేయాలంటూ ఒక వర్గం రాస్తారోకోకు దిగడంతో మళ్లీ ఉద్రిక్తత నెలకొంది. కుళిత్తలై డీఎస్పీ సెంథిల్‌కుమార్ ఆందోళనకారులో చర్చించి ఆందోళన విరమింపజేశారు. గ్రామంలో మళ్లీ అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ పికెటింగ్ ఏర్పాటుచేశారు. కాగా, ఇరువర్గాలు పరస్పరదాడులకు పాల్పడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వెలువడి వైరల్‌గా మారాయి.

## లయన్స్ క్లబ్ నూతన సభ్యుల పదవీ స్వీకారం



విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

పెరంబూర్, జూలై 15: అరిమా సంఘం 324-ఎం గవర్నర్ పదవీ స్వీకారం ఆదివారం సాయంత్రం జరిగింది. కోయంబేడు సమీపంలోని ఓ కళాశాల ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లయన్ రామస్వామి, గౌరవ అతిథిగా జిల్లా గవర్నర్ లయన్ వరదరాజన్ పాల్గొన్నారు. కార్యక్రమంలో లయన్ సంపత్, లయన్ శంకర్, లయన్ బోస్, లయన్ రాజేష్ జోషి, లయన్ మాణిక్యం, లయన్ బాలాజీ రత్నం, లయన్ జగన్నాథన్, లయన్ మీనాక్షిసుందరం, లయన్ శేఖర్, లయన్ పన్నీర్‌సెల్వం, లయన్ గోకులన్, లయన్ యువరాజ్ నగరాజన్, లయన్ కన్నన్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా లయన్స్ సభ్యులు మార్చ్‌ఫాస్ట్ చేసి అందజేసిన గౌరవ వందనాన్ని గవర్నర్ స్వీకరించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు.

## తాత్కాలికంగా ఆగిన వివేకానంద రాక్ పడవ సవారీ

పెరంబూర్, జూలై 15: కన్నియాకుమారి వివేకానంద రాక్‌కు పడవ రవాణా తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు పూంపుహార్ నౌకాయాన సంస్థ తెలియజేసింది. భారీ వర్షాల కారణంగా పడవ రవాణా నిలిపివేస్తున్నట్లు తెలిపిన అధికారులు, బోట్ హౌస్ కూడా మూసివేశారు.

## కుట్రాలంలో వరద

● పర్యాటకుల తిరుగుముఖం



కుట్రాలం జలపాతం వద్ద నీటి ఉధృతి

చెన్నై, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లాలో పడమటి కనుమల్లో ఆదివారం సాయంత్రం కురిసిన కుండపోత వర్షాలకు కుట్రాలం జలపాతాలకి వద్ద భారీ వరద వచ్చింది. కుట్రాలం ప్రధాన జలపాతం, ఐందరువి, పులియరువి, పాత కుట్రాలం ప్రాంతాల్లో నీటి ప్రవాహం ఉధృతంగా ఉంది.. దీనితో కుట్రాలం జలపాతాల వద్ద పర్యాటకులను స్నానానికి అనుమతించకుండా అధికారులు నిషేధం విధించారు. ఇక సోమవారం ఉదయం జలపాతాల వద్ద చెదురుమదురుగా వర్షాలు కురవటంతో కుట్రాలం జలపాతం నిండి జలధారలు ఇనుప గేట్లను దాటి కిందకు ప్రవహించింది. ఆ జలపాతం వద్ద స్నానం చేయడానికి వెళ్ళిన పర్యాటకులంతా దూరం నుంచే వాటర్‌ఫాల్స్ ఫొటోలు తీసుకుని తిరుగుముఖం పట్టారు. ఇక రెండు మూడు రోజులదాకా పర్యాటకులను స్నానానికి అనుమతించే ప్రసక్తి లేదని అధికారులు ప్రకటించారు.

## ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసు నిందితుడు పొన్నైబాలుకు భద్రత కల్పించండి

● పోలీసు కమిషనర్‌కు భార్య వినతి



పొన్నైబాలు

చెన్నై, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో నిందితుడైన పొన్నైబాలు ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశముండటంతో పటిష్ఠమైన భద్రత కల్పించాలని అతడి భార్య పోలీసు కమిషనర్‌కు విజ్ఞప్తి చేసింది. ఈ హత్యకేసులో ప్రధాన నిందితుడైన తిరువేంగడం ఆదివారం మాధవరం వద్ద ఎన్‌కౌంటర్‌లో హతమైన నేపథ్యంలో ఆమ్‌స్ట్రాంగ్ హత్యకు ప్రధాన సూత్రధారుడైన పొన్నైబాలు సహా ఇతర నిందితులు ప్రాణభయంతో ఉన్నారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పొన్నైబాలుకు పటిష్ఠమైన భద్రత కల్పించాలంటూ ఆయన భార్య నగర పోలీసు కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించింది.

## ఆవును ఢీకొన్న వందే భారత్ రైలు



దెబ్బతిన్న వందే భారత్ రైలు ఇంజన్ ముందు భాగం

పెరంబూర్, జూలై 15: తిరునల్వేలి-చెన్నై వందే భారత్ రైలు ఆదివారం మదురై జిల్లా తిరుప్పరగుండ్రం సమీపంలో వస్తుంది. ఆ సమయంలో రైల్వే పట్టాలు పక్కన పొలాల్లో కొన్ని ఆవులు మేస్తున్నాయి. కానీ, వాటిలో ఓ ఆవు రైలుపట్టాలు దాటేందుకు యత్నించిన సమయంలో వందే భారత్ రైలు ఢీకొంది. ఈ ఘటనలో ఆవుకు గాయాలుకాగా, రైలింజన్ ముందు భాగం ధ్వంసమైంది. సమాచారం అందుకున్న రైల్వే సిబ్బంది అక్కడకు చేరుకొని దెబ్బతిన్న రైలింజర్ ముందు భాగంలో తాత్కాలిక మరమ్మతు చేయగా రైలు మదురై బయల్దేరింది.

## మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభం



వేలూరు, జూలై 15: కార్పొరేషన్ కమిషనర్ ఉత్తర్వులతో కాట్పాడి 15వ వార్డులో పాలారు ఒడ్డున 500 మొక్కలు నాటే కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. కార్పొరేషన్ 1వ వార్డు మండల ఆరోగ్యశాఖ అధికారి శివకుమార్ నేతృత్వంలో ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. వివాహ, జన్మదినం, శుభ కార్యక్రమాల స్మారకంగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని అధికారి శివకుమార్ పిలుపునిచ్చారు.

## శివకాశిలో బాణసంచా ఫ్యాక్టరీకి సీలు

● ముగ్గురి అరెస్టు

అడయార్, జూలై 15: విరుదునగర్ జిల్లా శివకాశి కార్పొరేషన్ పరిధిలోని తిరుత్తంగల్ అనే ప్రాంతంలో చట్ట వ్యతిరేకంగా ఎలాంటి అనుమతి లేకుండా పెట్టిన బాణసంచా ఫ్యాక్టరీని స్థానిక అధికారులు గుర్తించి సీజ్ చేశారు. దీనికి సంబంధించి, ఆ ఫ్యాక్టరీ యజమాని సహా మొత్తం ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. జనావాస ప్రాంతాల్లో ఉన్న ఈ ఫ్యాక్టరీలో భారీ ఎత్తున నల్లమందు తయారు చేస్తున్నట్టు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు రావడంతో పోలీసులతో కలిసి రెవెన్యూ అధికారులు ఆ ఫ్యాక్టరీలో తనిఖీ చేయగా, ఎలాంటి అనుమతులు లేవని తేలింది. దీంతో ఫ్యాక్టరీని సీజ్ చేశారు. అంతేకాకుండా, ఈ ఫ్యాక్టరీని స్థాపించిన బాల్‌పాండి (48) అనే వ్యక్తితో పాటు మొత్తం ముగ్గురిని అరెస్టు చేశారు. వీరిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదుచేసి విచారణ జరుపుతున్నారు.

## మహిళా ఎస్‌ఐ ఆత్మహత్యాయత్నం

అడయార్, జూలై 15: దిండిగల్ జిల్లాలో చెన్నైకు చెందిన ఒక మహిళా ఎస్‌ఐ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. సోమవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలను పరిశీలిస్తే, దిండిగల్ సమీపంలోని సీలప్పాడి సుబ్రమణ్యపురం ప్రాంతానికి చెందిన గోపాల్ కుమార్తె సరోజిని (28) చెన్నై ఎగ్మోర్‌లోని సెంట్రల్ క్రైం బ్రాంచ్ ఎస్‌ఐగా పనిచేస్తున్నారు. ఈమె గ్రూపు-1 పరీక్ష రాసేందుకు శనివారం చెన్నై నుంచి దిండిగల్ చేరుకున్నారు. ఈ పరీక్ష రాసి ఇంటికి వచ్చిన ఆమె.. పరీక్ష బాగా రాయలేదన్న మనస్తాపంతో తన తండ్రి వాడే బీపీ మాత్రలు అధిక మోతాదులో మింగి ఆత్మహత్యకు ప్రయత్నించారు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటిన సమీపంలోని ఆస్పత్రికి తరలించడంతో ఆమె ప్రాణగండం నుంచి బయటపడ్డారు. దీనిపై దిండిగల్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

## 2026 ఎన్నికల్లో డీఎంకే ఘన విజయం

● ఈవీకేఎస్ ఇళంగోవన్ జోస్యం

అడయార్, జూలై 15: విల్లుపురం జిల్లా విక్రవాండి అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో డీఎంకేకు లభించిన గెలుపు 2026లో జరిగే శాసనసభ ఎన్నికలపై ప్రభావం చూపుతుందని, ఫలితంగా ఆ ఎన్నికల్లో డీఎంకే కూటమి ఘన విజయం సాధిస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేత, టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు ఈవీకేఎస్ ఇళంగోవన్ వ్యాఖ్యానించారు. దివంగత మహానేత కామరాజర్ జయంతిని పురస్కరించుకుని ఈరోడ్‌లో కామరాజర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశంలో ఏడు రాష్ట్రాల్లో 13 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో ఇండియా కూటమి అధిక స్థానాలను గెలుచుకోగా బీజేపీ రెండో స్థానానికి పడిపోయిందన్నారు. ఇది ప్రధాని మోదీకి గట్టి ఎదురుదెబ్బ వంటిందన్నారు. తమిళనాడులో అధిక సంఖ్యలో విద్యావంతులు ఉన్నారంటున్నారని, దీనికి మూల పురుషుడు కామరాజర్ అని చెప్పారు. విక్రవాండి ఉప ఎన్నికల్లో డీఎంకే ఓటర్లకు డబ్బులు పంచలేదనీ, కానీ పీఎంకే అభ్యర్థి విజయం కోసం రూ.500 నుంచి రూ.1000 వరకు ఇచ్చారని ఆయన ఆరోపించారు. ఈ ఎన్నికల్లో ఒక్క అన్నాడీఎంకే ఓట్లు మాత్రమే కాకుండా, ప్రతి ఒక్క తమిళ ఓటరు ఓటు వేశారని చెప్పారన్నారు. అందువల్ల ఈ గెలుపు ప్రభావం వచ్చే 2026 అసెంబ్లీ ఎన్నికల్లో ఉంటుందని ఆయన జోస్యం చెప్పారు.

## ఎన్‌కౌంటర్‌పై అనుమానాలెన్నో...! : అన్నామలై

చెన్నై, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీ నేత ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసు ప్రధాన నిందితుడు, రౌడీ తిరువేంగడం ఎన్‌కౌంటర్‌లో ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, అతడిని వేకువజామునే పోలీసులు ఎందుకు తీసుకెళ్ళారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ప్రశ్నించారు. చేతికి సంకెళ్ల వేసి ఉంటే ఎలా తప్పించుకోగలిగాడో పోలీసులు తెలుపాలని డిమాండ్ చేశారు. ఆమ్‌స్ట్రాంగ్ హత్య జరిగినప్పుడే తాను మీడియాతో మాట్లాడుతూ హంతకులను తీవ్ర విచారించాలని, పోలీసులు ఎన్‌కౌంటర్‌పై దృష్టిపెట్టకూడదని చెప్పానని, అయితే తన అనుమానమే నిజమై తిరువేంగడం ఎన్‌కౌంటర్ హతమయ్యాడని తెలిపారు. తిరువేంగడం తుపాకీతో కాల్పులు జరిపాడని పోలీసులు చెప్పడం వింతగా ఉందని, అతడి చేతికి ఉన్నట్టుండి రివాల్వర్ ఎలా వచ్చిందో చెప్పాలన్నారు. తిరువేంగడం ప్రధాన నిందితుడని, విచారణలో ఎన్నో విషయాలు చెప్పాడన్న పోలీసులు అతడు చెప్పిన విషయాలన్నీ దాచివేయడం ఖాయమని, ఎందుకంటే తిరువేంగడం హతమయ్యాడని చెప్పారు. ఆమ్‌స్ట్రాంగ్ హత్యపై సీబీఐ విచారణ జరపాలంటూ డీఎంకే మిత్రపక్షాలే డిమాండ్ చేస్తున్నాయని ఆయన చెప్పారు.

## ఎన్‌కౌంటర్ ప్రదేశాన్ని పరిశీలించిన న్యాయమూర్తి

అడయార్, జూలై 15: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసులోని ప్రధాన నిందితుడు, రౌడీ తిరువేంగడం ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతానికి ఆదివారం రాత్రి మాధవరం క్రైమ్ కోర్టు న్యాయమూర్తి దీపా పరిశీలించారు. అక్కడ నుంచి స్టాన్లీ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి, మృతుడు తిరువేంగడం తండ్రి కన్నన్, అక్క మునియమ్మాళ్ వద్ద కూడా న్యాయాధికారి విచారణ జరిపారు. ఆ తర్వాత మృతుడిని గుర్తించేందుకు కుటుంబ సభ్యుల్లో ముగ్గురిని మార్చురి గదిలోకి తీసుకెళ్ళి, తిరువేంగడం మృతదేహాన్ని గుర్తించారు. ఆ తర్వాత మృతదేహాన్ని ఎక్స్‌రేతో పాటు స్కాన్ తీశారు. ఆ తర్వాత ఆదివారం అర్ధరాత్రి 12 నుంచి 2.30 గంటల వరకు వైద్యులు ప్రియదర్శిని, నారాయణన్, రాజేష్‌లతో కూడిన వైద్య బృందం శవ పంచనామా పూర్తి చేశారు. తరువాత మృతదేహాన్ని తిరువేంగడం కుటుంబ సభ్యులకు అప్పగించగా, సోమవారం ఉదయం మూలకొత్తళం శ్మశాన వాటికలో దహనం చేశారు. ఈ సందర్భంగా స్టాన్లీ ఆస్పత్రితో పాటు శ్మశానవాటిక వద్ద పోలీసులు గట్టి బందోబస్తును కల్పించారు.

## ఎన్‌కౌంటర్ పేరుతో నిజాన్ని చంపేశారు

● బీజేపీ నేత తమిళిసై

ప్యారీస్, జూలై 15: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో లొంగిపోయిన నిందితుల్లో ఒకరైన తిరువేంగడంను ఎన్‌కౌంటర్ చేయడం హత్యకు సంబంధించిన వాస్తవాలను దాచడానికేనని బీజేపీ సీనియర్ నేత తమిళిసై సౌందర్‌రాజన్ ఆరోపించారు. స్థానిక అన్నాసాలైలోని జింఖానా క్లబ్ సమీపంలో సోమవారం కామరాజర్ విగ్రహానికి నివాళులర్పించిన సందర్భంగా తమిళిసై మీడియాతో మాట్లాడారు... ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం కళ్లకుర్చిలో కల్తీ సారా మరణాలు, ఆమ్‌స్ట్రాంగ్ హత్య సంఘటనపై వాస్తవాలు కప్పిపెట్టి నిందితులను కాపాడే ప్రయత్నాలు చేపట్టిందని ఆరోపించారు. ఇదిలా ఉండగా, ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసును సీబీఐకి అప్పగించాలని ఆయన భార్య, న్యాయవాది పొరుకొడి డిమాండ్ చేశారు. బీఎస్పీ తరఫున గవర్నర్ ఆర్ఎన్ రవిని కలిసి వినతిపత్రం సమర్పించనున్నట్లు ఆమె తెలిపారు.

## సమాచార దర్శిని

### రేపు అథ్లెటిక్ పోటీలు

ఐసిఎఫ్, జూలై 15: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంటీసీ ఉద్యోగులకు బుధవారం అథ్లెటిక్ పోటీలు నిర్వహించనున్నట్లు మెట్రోపాలిటన్ రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆల్బీజాన్ వర్గీస్ తెలిపారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నారు. అలాగే, 50 ఏళ్లకు పైబడిన వారికి ప్రత్యేక పరుగు పందెం పోటీలు జరుగనున్నాయి. స్థానిక పల్లవన్ రోడ్డులోని కేంద్రీయ విద్యాలయం ప్రాంగణంలో ఉదయం 7గంటల నుంచి పోటీలు జరుగనున్నామని,విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామని ఆయన తెలిపారు.

### ఆగస్టులో మినీ టైడల్ పార్క్ ప్రారంభం

ఐసిఎఫ్, జూలై 15: తంజావూరులో నిర్మించిన మినీ టైడల్ పార్క్ ఆగస్టులో ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. తంజావూరులో మూడంతస్తుల్లో రూ.30.50 కోట్లతో మినీ టైడల్ పార్క్ నిర్మించారు. కొత్త బస్టాండ్ సమీపంలోని మేలవస్తాచావిడిలో ఏర్పాటవుతున్న పార్క్ నిర్మాణపనులు 95 శాతం పూర్తయ్యాయి. ఆగస్టు 5వ తేదీ ప్రారంభించనున్న ఈ పార్క్ ద్వారా 1,000 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అధికారులు తెలిపారు.

### నేడు విద్యుత్ గ్రీవెన్స్

ఐసిఎఫ్,జూలై15:స్థానిక పోరూర్ చెట్టియార్ అగరం రోడ్డులో ఉన్న ఎస్ఆర్ఎంసీ ఉప విద్యుత్ కేంద్ర ప్రాంగణంలో మంగళవారం ఉదయం 11 గంటలకు విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. పోరూర్ పరిసర ప్రాంతాలకు చెందిన వినియోగదారులు పాల్గొని, తమ సమస్యలకు పరిష్కారం పొందాలని అధికారులు తెలిపారు.

### డెంగ్యూను నియంత్రించండి

ఐసిఎఫ్, జూలై 15: డెంగ్యూ వ్యాపించకుండా నియంత్రించాలని అధికారులకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కృష్ణగిరి, ధర్మపురి, ఈరోడ్, సేలం జిల్లాల ఆరోగ్య శాఖ అధికారులకు ఆ శాఖ డైరెక్టర్ సెల్వవినాయగం పంపిన సర్క్యులర్‌లో... కర్ణాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో డెంగ్యూ ప్రభావం ఎక్కువగా ఉందని, సరిహద్దు జిల్లాల్లో డెంగ్యూ నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆరోగ్యశాఖ సూచించింది.

### 8 మందికి ఆర్థిక సాయం

ఐసిఎఫ్, జూలై 15: కరుణానిధి ట్రస్ట్ ఆధ్వర్యంలో 8మంది పేదలకు రూ.2 లక్షల ఆర్థికసాయాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ అందజేశారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి ట్రస్ట్ తరఫున ప్రతినెలా పేదలకు ఆర్థికసాయం అందుతోంది. 2005 నుంచి ఇప్పటివరకు రూ.6.3కోట్లు అందజేశారు. ఆ ప్రకారం, ఈనెల8 మందికి తలా రూ.25వేల వంతున సోమవారం ముఖ్యమంత్రి అందజేశారు. తేని, దిండుగల్, రామనాథపురం, విరుదునగర్, తిరునల్వేలి, తూత్తుకుడి, కన్నియాకుమారి, పుదుచ్చేరికి చెందిన పేద కుటుంబాలకు ఈ ఆర్థికసాయం చెక్ రూపంలో అందజేశారు.

### 4,084 మెగావాట్లకు చేరుకున్న పవన విద్యుదుత్పత్తి

పెరంబూర్, జూలై 15: రాష్ట్రంలో పవన విద్యుదుత్పత్తి 4,084 మెగావాట్లకు చేరుకుంది. గాలి వేగం పెరగడంతో నెల రోజుల అనంతరం పవన విద్యుదుత్పత్తి మళ్లీ 4,000 మెగావాట్లు దాటింది. నెల రోజుల క్రితం 3,000 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి జరుగుతుండగా, సోమవారం పవన విద్యుదుత్పత్తి 4,084 మెగావాట్లకు చేరుకుంది. మే నుంచి ఆగస్టు వరకు సీజన్ కావడంతో పవన విద్యుత్ 5,000 మెగావాట్ల వరకు లభించే అవకాశముందని విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు.

### స్థలాల అంగీకార వివరాలకు యాప్

ఐసిఎఫ్, జూలై15:ఇళ్లస్థలాల అంగీకారానికి సంబంధించిన వివరాలు తెలుసుకొనేలా యాప్ పరిచయం చేయనున్నారు. రాష్ట్రంలో ఇళ్లస్థలాలు విక్రయించే రియల్ ఎస్టేట్ సంస్థలు, కొన్ని సమయాల్లో ఒకరికి విక్రయించిన స్థలాన్ని మరొకరికి విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. దీనిపై స్పందించిన సీఎండీఏ, డీటీసీటీ ప్రభుత్వ అనుమతి పొందిన స్థలాలకు మ్యాప్ రూపొందించాయి. అలాగే, స్థలాల వివరాలు తెలుసుకొనేలా కొత్త యాప్ ప్రవేశపెట్టనున్నారు.

### రూ.20 కోట్లతో గ్రంథాలయాల అభివృద్ధి

ఐసిఎఫ్, జూలై 15: నగరంలోని గ్రంథాలయాలను రూ.20 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు సీఎండీఏ అధికారులు తెలిపారు. నగరంలోని పది ప్రాంతాల్లో ఉన్న పబ్లిక్ లైబ్రరీల్లో మౌలిక వసతుల కల్పనకు సీఎండీఏ చర్యలు చేపట్టింది. ఈ విషయమై అధికారులు మాట్లాడుతూ.. అశోక్ నగర్, తిరువిక నగర్, పెరియార్ నగర్, అన్నా నగర్, కొళత్తూర్, రాయపేట వంటి ప్రాంతాల్లో ఉన్న గ్రంథాలయాల్లో వైఫై, స్పీడ్ ఇంటర్నెట్, ఏసీ గదులు, ఆడిటోరియం వంటి అధునాతన సౌకర్యాలు కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు.

### పులి గోళ్లు విక్రయించిన ఇద్దరి అరెస్ట్

ఐసిఎఫ్, జూలై 15: నీలగిరి జిల్లా మంజూరులో పులి దంతాలు,గోళ్లు విక్రయించిన ఇద్దరిని అటవీ శాఖ అధికారులు అరెస్ట్ చేశారు. మంజూరు ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు పులి గోళ్లు విక్రయిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు సమాచారం అందింది. దీంతో అధికారులు మంజూరు సమీపంలోని తుంబనేరికొంబై గిరిజన గ్రామానికి వెళ్లారు. అక్కడున్న లక్ష్మణన్, చంద్రన్ వద్ద పులి గోళ్ళు, దంతాలు గుర్తించి స్వాధీనం చేసుకొని, ఇద్దర్నీ అరెస్ట్ చేశారు. వీరు అటవీ ప్రాంతంలో మృతిచెందిన వన్యమృగాల గోళ్లు, పళ్లు, చర్మం వంటి వాటిని విక్రయిస్తుంటారని విచారణలో తెలిసింది.

### 29 నుంచి విద్యాశాఖ కార్యాలయ ముట్టడి

పెరంబూర్, జూలై15: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల సంఘం ఆందోళనకు సిద్ధమైంది. ఈ సంఘం సమావేశం ఆదివారం తిరుచ్చిలో జరిగింది. సంఘ ప్రధాన కార్యదర్శి ఎస్.మయిల్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి సంబంధించి 243జీవో రద్దు, పాత పింఛన్ విధానం అమలు, మహిళా ఉపాధ్యాయులకు పదోన్నతితో సహా 31 సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 29,30,31 తేదీల్లో చెన్నైలో పాఠశాల విద్యాశాఖ ముట్టడి కార్యక్రమం చేపట్టనున్నామని మయిల్ తెలిపారు.

### 67కు పెరిగిన కల్తీ సారా మృతులు

పెరంబూర్, జూలై 15: కళ్లకుర్చి కరుణాపురంలో కల్తీ సారా తాగిన ఘటనలో మృతుల సంఖ్య 67కు పెరిగింది. పుదుచ్చేరి జిప్మర్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న కన్నన్ సోమవారం ఉదయం మృతిచెందాడు. ప్రస్తుతం కల్తీ సారా సేవించిన తమ ఆసుపత్రిలో చేరిన వారిలో ఒకరు మాత్రమే ప్రస్తుతం వైద్యచికిత్సలు పొందుతున్నారని జిప్మర్ వైద్యులు తెలిపారు.

### 29 వరకు జాలర్ల రిమాండ్ పొడిగింపు

పెరంబూర్, జూలై 15: శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసిన 25మంది పాంబన్ జాలర్ల రిమాండ్‌ను ఈ నెల 29వ తేది వరకు ఆ దేశ న్యాయస్థానం పొడిగించింది. ఈనెల 1వ తేది సరిహద్దులు దాటారంటూ 25 మంది జాలర్లు, 4 పడవలను లంక నావికాదళం అదుపులోకి తీసుకుంది. ప్రస్తుతం జైల్లో ఉన్న జాలర్ల రిమాండ్ సోమవారంతో ముగిసిన నేపథ్యంలో, రిమాండ్ పొడిగిస్తూ ఆ దేశ న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది.

## మరో 84 ఆస్పత్రులకు 'సీఎం వైద్య బీమా' వర్తింపు

పెరంబూర్, జూలై 15: 'ముఖ్యమంత్రి సమగ్ర వైద్య బీమా' పథకంలో రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 84 ప్రైవేటు వైద్యశాలలు చేర్చారు. ఈ పథకం కింద రాష్ట్రంలో 1.45 కోట్ల కుటుంబాలు లబ్ధిపొందుతున్నాయి. ఈ బీమా కలిగిన వారికి ఏడాదికి రూ.5 లక్షల వరకు ఉచితంగా వైద్యం చేయించుకోవచ్చు. మొత్తం 1,513 రకాల చికిత్సలు ఈ పథకంలో అందిస్తున్నారు. ఇవి కాకుండా కాలేయం, కిడ్నీ, గుండె, ప్యాంక్రియాస్, బోన్, బోన్ మ్యారో, రెటినాల్ ట్రాన్స్‌ప్లాంట్ సహా 8 రకాల అధునాతన శస్త్రచికిత్సలు బీమా పథకంలో అందిస్తున్నారు. ఈ పథకం 854 ప్రభుత్వ, 975 ప్రైవేటు మొత్తం 1,829 ఆస్పత్రుల్లో అందిస్తుండగా, కొత్తగా మరో 84 ప్రైవేటు ఆసుపత్రుల్లో ఈ పథకం వర్తింపజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

## 11 నుంచి తిరుచ్చి-అబుదాబి మధ్య మరో నాలుగు విమానాలు

పెరంబూర్, జూలై 15: తిరుచ్చి-అబుదాబి మధ్య ఆగస్టు 11 నుంచి నాలుగు అదనపు విమాన సర్వీసులు నడుపనున్నారు. పదేళ్ల క్రితం, చెన్నై నుంచి బయల్దేరే ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం తిరుచ్చి మీదుగా అబుదాబికి వారంలో ఒక రోజు మాత్రమే నడిపేవారు. నిర్వాహణ కారణాలతో ఆ సేవలు కూడా రద్దయ్యాయి. అనంతరం 2022 మార్చి నుంచి వారంలో సోమవారం సాయంత్రం 5.30 గంటలకు తిరుచ్చి నుంచి అబుదాబికి విమాన సర్వీసు ప్రారంభం కాగా, అనంతరం శుక్ర, ఆదివారాల్లో కూడా సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో, ఆగస్టు 11వ తేది నుంచి సోమ, బుధ, శుక్ర, ఆదివారాల్లో తిరుచ్చి నుంచి అబుదాబికి విమానాలు నడుపనున్నట్లు ఇండిగో విమాన సంస్థ తెలిపింది.

## నార వస్తువుల తయారీకి ఆహ్వానం

ఐసిఎఫ్, జూలై 15: స్థానిక కోయంబేడు మార్కెట్లో అరటి వ్యర్థాలు సేకరించి వస్తువులు తయారుచేసేందుకు ఆసక్తి కలిగిన వ్యక్తులు, సంస్థలను సీఎండీఏ ఆహ్వానిస్తోంది. వ్యర్థాలు తొలగించడంలో సీఎండీఏ పలు సవాళ్ల ఎదుర్కొంటోంది. వ్యర్థాలు తొలగించడంతో పాటు వాటితో ప్రయోజనకరమైన వస్తువులు తయారుచేసి ఆదాయం చేకూర్చేలా నిర్ణయం తీసుకున్న అధికారులు, అరటి, ఇతర నార వ్యర్థాల నుంచి వస్తువులు తయారుచేసే నైపుణ్యం కలిగిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 22లోపు www.tntelders.gov.in,htti-p://www.cmdachennai.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. సందేహాల నివృత్తి కోసం 23వ తేది సాయంత్రంలోపు caommc2012@gmail.com అనే ఈ-మెయిల్ చిరుమానాలో సంప్రదించాలి.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, జూలై 15: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

**టి.నగర్:** కట్టబొమ్మన్ బ్లాక్, ముత్తురంగం బ్లాక్, అంజుగం నగర్, పారి నగర్, స్కూల్ వీధి, ఆర్ఆర్ కాలని, వీఎస్ఎం గార్డన్, భారతి బ్లాక్, ఏరికరై వీధి, సైదాపేట వెస్ట్ ఏరియా, 11వ అవెన్యూ, 7వ అవెన్యూ, ఎల్ఐసీ కాలని, నాగాత్తమ్మన్ ఆలయ వీధి, అన్నామలై చెట్టి నగర్, కేవీ కాలని 1 నుంచి 5 వీధులు, పోస్టల్ కాలనీ 1 నుంచి 4 వీధులు, కామాక్షి పురం 2వ వీధి, 10వ అవెన్యూ, అశోక్ నగర్ 58 నుంచి 64 వీధులు, నాయకమార్ వీధి, మూవేందర్ కాలని, అశోక్ నగర్, పిల్లయార్ ఆలయ వీధి, శేఖర్ నగర్, వెస్ట్ జోన్స్ రోడ్డు, అశోక్ నగర్ 12వ అవెన్యూ, రామాపురం రామస్వామి వీధి, రాజగోపాల్ వీధి, ఆంజనేయ ఆలయ వీధి, రామానుజం వీధి, భారతియార్ వీధి, మసీదు పాళయం, ధనశేఖరన్ వీధి, వీజీపీ రోడ్డు, కొత్వాల్ చావిడి వీధి, సారధి నగర్, దురైస్వామి గార్డన్, నారాయణస్వామి వీధి, వినాయకపురం, పెరుమాళ్ ఆలయ వీధి, న్యూ కాలని.

**షోలింగనల్లూర్:** ఐటీ కారిడార్, పరమేశ్వరి నగర్, ఆవిన్, ఎల్కాట్, విప్రో, టీసీఎస్, సత్యం, సత్యభామ, సెమ్మంజేరి, ఇంజంబాక్కం, షోలింగనల్లూర్, ప్రిస్టేజ్, కుమరన్ నగర్, ఎల్కాట్ అవెన్యూ రోడ్డు, మోడల్ స్కూల్ రోడ్డు, క్లాసిక్ పార్మశీ, నెడుంజెళియన్ వీధి, నారాయణస్వామి వీధి, పడవేట్టమ్మన్ ఆలయ వీధి, కుమరన్ నగర్, అలమేలు మంగాపురం, గాంధీ నగర్, నూక్కంపాళయం రోడ్డు, తిరువళ్లువర్ రోడ్డు, పాండిచ్చేరి పేట, సెమ్మంజేరి, జవహర్ నగర్, సత్యభామ, సెయింట్ జోసఫ్ కళాశాల, విలేజ్ హైరోడ్డు, వేలునాయకర్ వీధి, గణేష్ నగర్, నెహ్రూ వీధి, మేడవాక్కం రోడ్డు, రాజీవ్ గాంధీ రోడ్డు, విప్రో రోడ్డు, అన్నా వీధి, దేవరాజ్ నగర్, న్యూ కుమరన్ నగర్, ఎళిల్ నగర్, గాంధీ వీధి, ఎంజీఆర్ వీధి

**తండయార్‌పేట:** గుమ్మాలమ్మన్ ఆలయ వీధి, జీఏ రోడ్డు, టీహెచ్ రోడ్డు, సోలయప్పన్ వీధి, కప్పల్‌పోలు వీధి, వీపీ ఆలయ వీధి, తాండవరాయన్ వీధి, రైనీ ఆసుపత్రి, శ్రీరంగమ్మాళ్ వీధి, రామానుజం వీధి, సంజీవరాయన్ వీధి, సుబ్బరాయన్ వీధి, బాలు మొదలి వీధి, పాత వాషర్‌మెన్‌పేట, ఇలయ వీధి, మన్నప్పన్ వీధి, తంగవేల్ వీధి, నైనియప్పన్ వీధి, పెరుమాళ్ ఆలయ వీధి, వీరాకుట్టి వీధి, కేజీ గార్డన్, మేయర్ బాసుదేవ్ వీధి

**పల్లావరం:** వెంకటేశ్వర నగర్, గురుస్వామి నగర్, ఎంజీఆర్ నగర్, కరుణానిధి వీధి, భక్తవత్సలం వీధి, శాంతి నగర్, జ్ఞానియార్ వీధి, అరుళ్ నగర్, వీజీఏ నగర్

**అంబత్తూర్:** తిరుపతి నగర్, వానగరం రోడ్డు, నాందోపు రోడ్డు, శంకర్ సీలింగ్ రోడ్డు, కృష్ణస్వామిపిళ్లై రోడ్డు, నల్లపాలయం రోడ్డు, స్కూల్ రోడ్డు, శాంతోమ్ రోడ్డు, సేవా ఆరోదయ ప్లాట్స్

**గిండీ:** నంగనల్లూర్ తిల్లై గంగానగర్ 1 నుంచి 19 వీధులు, నంగనల్లూర్ 1 నుంచి 4 మెయిన్ రోడ్లు, నంగనల్లూర్ రామ్ నగర్, నంగనల్లూర్ 4 నుంచి 38 వీధులు, సురేందర్ నగర్, టీపీ కాలని, లక్ష్మీ హయగ్రీవర్ కాలని, పార్థసారధి నగర్, మహాలక్ష్మి నగర్, ఏరికరై వీధి, ఆండాళ్ నగర్, పల్లవన్‌తాంగల్, జీవన్ నగర్, సంజయ్ గాంధీ నగర్, వేళచ్చేరి, ఆదంబాక్కం, ఆండాళ్ నగర్, వానువంపేట, బృందావన్ నగర్, శాంతి నగర్, పుళిదివాక్కం, ఉల్లగరం, మోహనపురి, ఆదంబాక్కం న్యూ కాలని

## రూ.1.74 కోట్లతో మహిళలకు జిమ్‌లు

పెరంబూర్, జూలై 15: గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ఆధ్వర్యంలో రూ.1.74 కోట్లతో కొత్తగా ఐదు ప్రాంతాల్లో మహిళా వ్యాయామశాలలు ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం ఆరోగ్యంపై ఆసక్తి చూపుతున్న ప్రజలు, వ్యాయామశాలలకు అధికంగా వెళుతున్నారు. దీంతో, జీసీసీ ఆధ్వర్యంలో 6 మహిళా వ్యాయామశాలలు సహా 198 వ్యాయామశాలలు పనిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, తిరువికనగర్ మండలం 68వ వార్డు జవహర్ నగర్‌లో రూ.42.20 లక్షలు, తిరువొత్తియూర్ మండలం 1వార్డు ఎన్నూర్ బైపాస్ రోడ్డు, 10వ వార్డు పూంతోట్టమ్ రోడ్డు తదితర రెండు ప్రాంతాల్లో రూ.61.20 లక్షలు, తండయార్‌పేట మండలం 38వ వార్డు పటేల్ నగర్‌లో రూ.34.25 లక్షలు, కోడంబాక్కం మండలం 128వ వార్డు ఇళంగో నగర్ రోడ్డులో రూ.36.97 లక్షలు మొత్తం రూ.1.74 కోట్లతో ఐదు ప్రాంతాల్లో మహిళా వ్యాయామశాలలు ఏర్పాటుకానుండగా, ఈ కొత్త కేంద్రాలతో జీసీసీ పరిధిలోని మహిళా వ్యాయామశాలల సంఖ్య 11కు పెరుగుతుందని అధికారులు తెలిపారు.

## హైకోర్టును ఆశ్రయించిన ఎంఆర్ విజయభాస్కర్

● ముందస్తు బెయిల కోసం మాజీ మంత్రి పిటిషన్



మాజీ మంత్రి ఎంఆర్ విజయభాస్కర్

చెన్నై, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పోలీసుల కంటపడకుండా అజ్ఞాతంలో ఉన్న అన్నాడీఎంకే మాజీ మంత్రి ఎంఆర్ విజయభాస్కర్ హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో బెయిలు పిటిషన్ దాఖలు చేశారు. నకిలీ పత్రాలతో భూకబ్జాకు పాల్పడ్డారనే ఆరోపణలపై నమోదైన కేసులో బెయిలు కోరుతూ విజయభాస్కర్, ఆయన సోదరుడు తదితరులు హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో పిటిషన్ సమర్పించారు. కరూరు జిల్లా మణమంగళం తాలూకా కుప్పిచ్చిపాళయంకు చెందిన ప్రకాష్ అనే వ్యక్తికి చెందిన రూ.100 కోట్ల విలువైన భూములను విజయభాస్కర్ నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేసుకోవడంతో పాటు అతడిని హతమారుస్తానంటూ బెదిరించినట్లు కరూరు ఎస్పీ కార్యాలయంలో కేసు నమోదైంది. బాధితుడు ప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదుపై కరూరు జిల్లా క్రైంవిభాగం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఆ తర్వాత ఈ కేసును సీబీసీఐడీకి బదిలీ చేశారు. ఆ నేపథ్యంలో కరూరు ప్రిన్సిపల్ కోర్టులో ఎంఆర్ విజయభాస్కర్ దాఖలు చేసిన బెయిలు పిటిషన్‌ను మేజిస్ట్రేట్ షణ్ముగసుందరం తోసిపుచ్చారు. ఆ తర్వాత విజయభాస్కర్ పరారయ్యారు. ఆయన ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో ఎంఆర్ విజయభాస్కర్ తరఫున బెయిలు పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై త్వరలోనే విచారణ జరుగనుంది.

# పార్తిబన్ తెరకెక్కించిన సైన్స్ ఫిక్షన్ 'టీన్జ్' కథ ఏంటి?

వైవిధ్యభరితమైన కథా చిత్రాలను తెరకెక్కించడంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సీనియర్ నటుడు, దర్శకనిర్మాత పార్తిబన్ తాజాగా బాల నటీనటులతో తెరకెక్కించిన చిత్రం 'టీన్స్'. గత శుక్రవారం విడుదలైంది. యుక్తవయసులో ఉన్న నటీనటులతో ఈ సైన్స్ ఫిక్షన్ మూవీ రూపొందించారు. డి.ఇమాన్ సంగీతం అందించారు. అయితే, నేపథ్య సంగీతం బాగున్నప్పటికీ పాటలు పెద్దగా ఆకట్టుకోలేకపోయాయి. జీసెస్ అంటూ సాగే పాట మాత్రమే బాగుందనిపిస్తుంది. యుక్త వయసు దాటిన తర్వాత బాలబాలికలు చేసే ప్రసంగాలు, వారి ప్రవర్తన, వీరి మధ్య చిన్నపాటి లవ్ ట్రాక్, ప్రేమ గీతాలు వంటివి బాగున్నాయి. అయితే, కొన్ని సన్నివేశాల్లో చిన్నారులుగా మద్యం సేవిస్తున్నట్టుగా చిత్రీకరించడం ఎబ్బెట్టుగా అనిపిస్తుంది. అదేసమయంలో ఒక సీన్ తర్వాత ఒక్కో నటుడు మాయమైపోవడం, చుట్టుపక్కల వారి అరుపులు, కేకలు, ఏడుపులు, మధ్యమధ్యలో మళ్ళీ ప్రేమ సన్నివేశాలు వంటివి స్ర్కీన్‌ప్లే నెమ్మదిగా సాగేలా చేస్తుంది. ముఖ్యంగా చిన్నారులు సుదీర్ఘ సంభాషణలు, వారి సాహస యాత్రకు వెళ్ళేందుకు వారు తమ ఇళ్ళలోని పెద్దలకు చెప్పే కారణాలు ఏమాత్రం సరిపోలేదు. అలాగే, ఒక క్యారెక్టర్‌ను హైలెట్ చేసేందుకు ఇంగ్లీష్ డైలాగుల పరంపర, సుదీర్ఘమైన ఆంగ్ల పాటలు ఇలాం టివి ప్రేక్షకుడికి బోర్‌కొట్టేలా చేస్తాయి. మొత్తంమీద చిన్నారులతో ఒక దర్శకుడిగా పార్తిబన్ చేసిన ఈ సైన్స్‌ఫిక్షన్ ప్రయోగం విఫలమైందని సినీ క్రిటిక్స్ అభిప్రాయపడుతున్నారు.



'టీన్జ్'లో ఓ దృశ్యం

# పెళ్ళి చేసుకున్నా సినిమాల్లో నటిస్తా

● వరలక్ష్మి

తాను వివాహం చేసుకున్నప్పటికీ సినిమాలకు మాత్రం దూరం కానని సీనియర్ నటుడు శరత్ కుమార్ కుమార్తె, సినీ నటి వరలక్ష్మి స్పష్టం చేశారు. సినిమాల్లో నటించేందుకు కూడా తన భర్త మనస్ఫూర్తిగా అనుమతిచ్చారని, అందువల్ల వివాహం తర్వాత సినిమాలకు దూరమయ్యే ప్రసక్తే లేదని ఆమె స్పష్టం చేశారు. ముంబైకు చెందిన వ్యాపారవేత్త నికోలయ్ సచ్‌దేవ్‌ను వరలక్ష్మి ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు. వీరి వివాహం ఇటీవల ముంబైలో ఘనంగా జరగ్గా... చెన్నైలోని ఓ హోటల్‌లో జరిగిన రిసెప్షన్‌కు దక్షిణాది చిత్రపరిశ్రమకు చెందిన అగ్రనటీనటులంతా హాజరయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం తమిళ సినిమా మీడియాను కలుసుకుని ధన్యవాదాలు తెలిపేందుకు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 'మీ అందరి ఆదరాభిమానాలతో ఈ స్థాయికి చేరుకున్నాను. వివాహం తర్వాత కూడా ఈ మద్దతు కొనసాగాలని కోరుతున్నాను. పెళ్ళి తర్వాత సినిమాల్లో నటిస్తావా? అంటూ చాలా మంది అడుగుతున్నారు. ఈ విషయంలో నా భర్తే స్వయంగా క్లారిటీ ఇచ్చారు. ఇకపై కూడా సినిమాల్లో నటిస్తాను. ఇపుడు నటించే చిత్రాలే కాకుండా కొత్త చిత్రాల్లో కూడా నటిస్తాను' అని స్పష్టం చేశారు. వరలక్ష్మి భర్త నికోలయ్ సచ్‌దేవ్ మాట్లాడుతూ, 'నా భార్య పెళ్ళి తర్వాత కూడా సినిమాల్లో నటిస్తారు. ఆమె ఫస్ట్‌లవ్ సినిమాలు, సెకండ్ లవ్ నేను. వివాహం తర్వాత పేరు మార్చుకుంటానని చెప్పగా, వద్దని వారించాను. ఇకపై కూడా వరలక్ష్మి శరత్ కుమార్‌గానే కొనసాగాలి. నా పేరు మాత్రం నికోలయ్ వరలక్ష్మి సచ్‌దేవ్‌గా మార్చుకుంటున్నాను' అని తెలిపారు. శరత్ కుమార్ మాట్లాడుతూ, 'ఒక పత్రికా విలేకరిగా ఉన్న నేను ఈ స్థాయికి చేరుకోవడానికి ప్రధాన కారణం మీడియానే. అందుకే మీ అందరికీ ధన్యవాదాలు తెలిపేందుకు ఈ సమావేశం. ఇకపై కూడా మీ ఆదరాభిమానాలు, మద్దతు కొనసాగాలని కోరుతున్నాను' అని పేర్కొన్నారు.




భర్త నికోలయ్, తండ్రి శరత్‌కుమార్‌తో వరలక్ష్మి

చిత్రజ్యోతి

# రౌడీ ఎన్‌కౌంటర్‌పై రజనీ నో కామెంట్స్

భారతదేశ అపరకుబేరుడు ముకేష్ అంబానీ ఇంటి వివాహానికి హాజరైన సూపర్‌స్టార్ రజనీకాంత్ ఆదివారం రాత్రి నగరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా విమానాశ్రయం వద్ద మీడియాతో మాట్లాడుతూ, అంబానీ ఇంటిలో జరిగే శుభకార్యం కావడంతో ప్రపంచం దృష్టిని ఆకర్షించేలా అంగరంగ వైభవంగా ఈ వివాహాన్ని నిర్వహించారన్నారు. ఈ వివాహ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఈ పెళ్ళికి హాజరైనందుకు ఎన్నో మరుపురాని స్మృతులను పొందినట్టు తెలిపారు. కాగా కమల్ హాసన్ నటించిన 'ఇండియన్-2' చిత్రంపై స్పందిస్తూ, తాను ఇంకా ఆ సినిమా చూడలేదని చూసిన తర్వాత స్పందన తెలియజేస్తానని చెప్పారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిక్షణ చర్యల్లో భాగంగా, రౌడీ ఎన్‌కౌంటర్‌పై ఆయన స్పందించేందుకు నిరాకరిస్తూ, నో కామెంట్స్ అంటూ అక్కడ నుంచి వెళ్ళిపోయారు.



# రక్తదానం చేసిన హీరో సూర్య



రక్తదానం చేస్తున్న హీరో సూర్య

ఈ నెల 23వ తేదీ హీరో సూర్య తన పుట్టిన రోజు జరుపుకోనున్నారు. దీనిని పురస్కరించుకుని ఆయన రక్తదానం చేశారు. ప్రతి యేటా హీరో సూర్య బర్త్‌డేను ఆయన అభిమానులు ఘనంగా నిర్వహిస్తుంటారు. వివిధ రకాల ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో పాటు, అన్నదానాలు, రక్తదానాలు చేస్తుంటారు. ఈ క్రమంలో తాజాగా సూర్య బర్త్‌డేను పురస్కరించుకుని ఉత్తర చెన్నై హీరో సూర్య అభిమాన సంఘం దక్షిణ జిల్లా చారిటీ తరపున రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయగా, ఇందులో సుమారు 400 మందికిపైగా అభిమానులు పాల్గొని రక్తదానం చేశారు. వీరిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేకంగా అభినందించారు. ఆ తర్వాత నగరంలోని తన కార్యాలయానికి ఆహ్వానించిన వారికి ప్రశంసా పత్రాలను బహుకరించారు. అలాగే, ప్రతి యేడాది తన బర్త్‌డే రోజున రక్తదానం చేసేలా చేసిన ప్రతిజ్ఞ మేరకు ఆయన కూడా రక్తదానం చేశారు. ఇదిలావుంటే, గత యేడాది జరిగిన పుట్టిన రోజు వేడుకల్లో దాదాపు రెండు వేల మందికి పైగా అభిమానులు రక్తం చేశారు.

# కొత్త బస్సులకు పచ్చజెండా



కొత్త బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

చెన్నై, జూలై 15 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం డిపో పరిధిలో 10 కొత్త బస్సులను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. తిరువళ్లూరు జిల్లా మబ్బేడు కూడలి రోడ్డు వద్ద సోమవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో రూ.3.81 కోట్లతో కొనుగోలు చేసిన 8 సబర్బన్ బస్సులను మహిళల వెలుగుబాట పయనం పథకానికి సంబంధించి రెండు సిటీ బస్సులను పచ్చజెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, కాంగ్రెస్ ఎంపీ శశికాంత్ సెంథిల్, శాసనసభ్యులు వీజీ రాజేంద్రన్, ఎస్.చంద్రన్, తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ డాక్టర్ డి.ప్రభుశంకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# తిరుచెందూరులో వైభవంగా ఆణి వరుషాభిషేకం



ఆలయగోపుర కలశాలకు వరుషాభిషేకం చేస్తున్న శైవ పండితులు, అర్చకులు

చెన్నై, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా తిరుచెందూరు సెంథిల్ ఆండవర్ (సుబ్రహ్మణ్యస్వామివారి) ఆలయంలో సోమవారం ఉదయం వరుషాభిషేకం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువ జాము నాలుగు గంటలకు సుప్రభాతం, 4.30 గంటలకు విశ్వరూపదర్శనం, 5 గంటలకు ఉదయమార్తాండ అభిషేకం, దీపారాధన నిర్వహించారు. అనంతరం ఆలయ మహామండపంలో కొలువుదీర్చిన మూలవర్లు, వళ్ళి, దేవయాని అమ్మాళ్ కుంభాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా కుమారవిడంగ పెరుమాళ్ సన్నిధిలో షణ్ముగస్వామి కుంభానికి, పెరుమాళ్ సన్నిధిలోని పెరుమాళ్ కుంభానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత ఆ కుంభాలను (వెండి బిందెలను) మంగళవాయిద్యాలు, శైవ పండితుల మంత్రోచ్ఛారణ నడుమ ఆలయ గోపుర శిఖరానికి తరలించారు. ఉదయం 10.15 గంటలకు మూలవిరాట్టు గర్భాలయ గోపురం, షణ్ముగపెరుమాళ్ సన్నిధి గోపుర కలశాలపై వేదపండితులు, ఆలయ అర్చకులు కుంభాలలోని పవిత్ర జలాలతో అభిషేకించారు. ఆ తర్వాత వళ్ళి, దేవయాని సన్నిధుల విమాన కలశాలకు కూడా అభిషేకం నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు సాయం సంధ్యాదీపారాధన జరిపారు. ఆ తర్వాత కుమార విడంగపెరుమాళ్, వళ్ళి అమ్మవారు వేర్వేరుగా మయూర వాహనాలపై ఆలయ ప్రధాన వీధుల్లో ఊరేగారు. రాత్రి మూలవిరాట్టుకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ డిప్యూటీ కమిషనర్ కార్తీక్, జిల్లా పంచాయితీ యూనియన్ అధ్యక్షులు బ్రహ్మశక్తి, ట్రస్టు బోర్డు సభ్యులు గణేశన్, రామదాస్, సెంథిల్ మురుగన్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సమాజానికి దుర్గాబాయి స్ఫూర్తి

● 115వ జయంతి సభలో వక్తలు



బహుమతులు అందుకున్న విద్యార్థినులతో నిర్వాహకులు, అతిథులు

ప్యారీస్, జూలై 15: స్వాతంత్ర్య సమరయోధురాలిగా, రచయిత్రిగా, సంఘ సంస్కర్తగా, భారత రాజ్యాంగం నిర్మాణ కమిటీలో ఏకైక మహిళగా రాణించి చరిత్రలో నిలిచిపోయిన దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సమాజానికి స్ఫూర్తినిచ్చారని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక జార్జిటౌన్‌లోని కన్యకా పరమేశ్వరి మహిళా కళాశాల ఐక్యూఏసీ, సృజన తెలుగు భాషా మండలి, దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సభ-చెన్నై నిర్వహణలోని దుర్గా స్రవంతి సాంస్కృతిక విభాగం సంయుక్త ఆధ్వర్యంలో దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ 115వ జయంతి సందర్భంగా ఆమె జీవిత విశేషాలతో సోమవారం అవగాహన శిబిరం ఘనంగా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ ఊటుకూరు శరత్‌కుమార్, ప్రిన్సిపాల్ డా.టి.మోహనశ్రీ, తెలుగు అధ్యాపకురాలు డా.పీఎస్ మైథిలి, డా.భరణికుమార్, దుర్గా స్రవంతి నిర్వాహకులు చెల్లపల్లి భానుమతి, పసుమర్తి జయశ్రీ, డా.తిరుమల ఆముక్త మాల్యద, పద్మలత, లక్ష్మీప్రసన్న, అనురాధ, ముఖ్యఅతిథి సౌత్ సిటీ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు డా.ఏవీ శివకుమారి తదితరులు దుర్గాభాయ్ సేవలు కొనియాడారు. 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ..' ప్రార్థనా గీతంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో భాగంగా దుర్గాభాయ్ జీవిత చరిత్రపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన బీసీఏ మూడో సంవత్సరం విద్యార్థిని అముదపాకు సుప్రియకు దుర్గా స్రవంతి తరఫున రూ.5,000 నగదు బహుమతి, అలాగే విద్యార్థినులకు, అతిథులకు జ్ఞాపికలు బహూకరించారు.

# కామరాజర్ విద్యాప్రదాత

● డీఆర్‌బీసీసీసీ ట్రస్టీ కన్నయ్య చెట్టి



కామరాజర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కన్నయ్యచెట్టి, ఎస్కేపీడీ ట్రస్టీలు

ప్యారీస్, జూలై 15: దివంగత మాజీ ముఖ్యమంత్రి కామరాజర్ పేద విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేయడంతో పాటు రాష్ట్రంలో 12 వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలలను ప్రారంభించిన విద్యా ప్రదాత అని ధర్మమూర్తి రావు బహదూర్ కలవల కన్నయ్య చెట్టీస్ చారిటీస్ మేనేజింగ ట్రస్టీ ఎంవీ కన్నయ్య చెట్టి అభివర్ణించారు. నగరంలోని ఎస్కేపీడీ బాలుర, కేటీసీటీ బాలికల మహోన్నత పాఠశాలల ఆధ్వర్యంలో కామరాజర్ జయంతిని సోమవారం విద్యాభివృద్ధి దినంగా జరుపుకున్నారు. ఎస్కేపీ కన్వెన్షన్ హాలులో మధ్యాహ్నం 2.30 గంటలకు పాఠశాలల గౌరవ కరస్పాండెంట్ ఎస్ఎల్ సుదర్శనం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కేటీసీటీ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.అనిల, ఎస్కేపీడీ బాలుర మహోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఓరుగంటి లీలారాణి స్వాగతం పలికారు. ఎస్కేపీడీ ట్రస్టీలు ఊటుకూరు శరత్‌కుమార్, దేసు లక్ష్మీనారాయణ, టీవీ రామకుమార్, సీఆర్ కిషోర్ బాబు, టీఎస్ బద్రీనాథ్, కార్యదర్శి ఎం.కిషోర్‌కుమార్‌లతో కలసి ముఖ్యఅతిథి కన్నయ్య చెట్టి కామరాజర్ చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించారు. కామరాజర్ గురించి తెలుగు, తమిళం, ఆంగ్ల భాషల్లో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. చివరగా ఈ రెండు పాఠశాలల్లో భాషా సాహిత్య సభ, క్రీడలు, ఆర్ఎస్పీ, జేఆర్సీ, ఎకో క్లబ్‌లను ప్రారంభించారు.

# సుబ్రమణ్యస్వామిని దర్శించుకున్న జపనీయులు



పెరంబూర్, జూలై 15: తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయానికి వచ్చిన జపాన్ దేశస్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆలయానికి ప్రతిరోజు పొరుగు జిల్లాలు, రాష్ట్రాలు, విదేశాలకు చెందిన భక్తులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో, సోమవారం జపాన్ దేశానికి చెందిన ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు మెడలో రుద్రాక్షలు ధరించి ఆలయానికి వచ్చారు. ఆలయ అర్చకులకు తమ రాసి చెప్పి తమిళంలో అర్చన చేయించుకున్నారు. అనంతరం ఉత్సవమూర్తి సన్నిధిలో కొద్దిసేపు ధ్యానం చేశారు. ఇక, ఆలయ ముందు యాచకులకు చీరలు, ధోవతులు అందజేశారు.

## అతుల్యా సీనియర్ కేర్‌లో

# వృద్ధుల ప్రశాంతతకు శిక్షణ



శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న నర్సులు, సహాయకులతో ఇంటర్నేషనల్ డెత్ డౌలా ఫౌండేషన్ నిర్వాహకులు, అతుల్యా సీనియర్ కేర్ నిర్వాహకులు

చెన్నై, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక మధువాయల్‌లోని అతుల్యా సీనియర్ కేర్‌లో అవసాన దశలో మంచానికే పరిమితమైన వృద్ధులకు ప్రశాంతత చేకూర్చేలా ఇంటర్నేషనల్ డెత్ డౌలా ఫౌండేషన్ ద్వారా సోమవారం ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ అభిజిత్‌దామ్, వ్యవస్థాపక కార్యదర్శి అవతార్ సింగ్ తదితరులు వృద్ధులను సంరక్షించే నర్సులు, ఇతర సహాయకులకు శిక్షణ ఇచ్చారు. ముఖ్యంగా దీర్ఘకాలిక రోగాలతో మంచానికే పరిమితమైన వృద్ధులకు మృత్యువుపై ఉన్న భయాన్ని పోగొట్టేలా ఆధ్యాత్మికపరమైన అంశాలు వివరిస్తూ, శ్లోకాలు, గీతాలు వినిపిస్తూ వారిలో సంతోషాన్ని నింపటమే ఈ శిక్షణ ప్రధానోద్దేశమని అతుల్యా సీనియర్ కేర్ సీఈఓ జి.శ్రీనివాసన్ తెలిపారు.



చెన్నైలో మాజీ ముఖ్యమంత్రి కామరాజర్ 122వ జయంతి సందర్భంగా పల్లవన్‌హౌస్ సమీపంలోని ఆయన విగ్రహం వద్ద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రులు అనితా రాధాకృష్ణన్, పీకే శేఖర్‌బాబు, మేయర్ ఆర్ ప్రియ, ఎమ్మెల్యేలు డి.వేలు, ఏఎంవి ప్రభాకర్‌రాజా, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, తమిళభాషాభివద్ధి, సమాచార శాఖ క్యాదర్శి సుబ్రమణియన్ తదితరులు



స్థానిక టి.నగర్ కామరాజర్ స్మారక గృహంలో ఆయన చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పిస్తున్న చిన్నారులు

# అలరించిన కవలల అరంగేట్రం



నృత్య ప్రదర్శన చేస్తున్న సాధన, సంయుక్త

చెన్నై, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు కుటుంబానికి చెందిన సాధన, సంయుక్త అనే కవలలు చేసిన భరతనాట్య అరంగేట్రం అలరించింది. అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోకు చెందిన శ్రీకాంత్, ప్రియ దంపతుల సంతానమైన ఈ ఇద్దరు చిన్నారుల అరంగేట్రం ఇటీవల మైలాపూర్‌లోని ఆర్ఆర్ సభలో జరిగింది. పుష్పాంజలి, గణేశస్తుపతి, నరసింహ కవుత్వం, వర్ణం, తిరుప్పావై, శివతాండవం, సీతా స్వయంవరం, థిల్లాన అంశాలను ప్రదర్శించారు. నరసింహ కవిత్వం అంశంలో నాట్యం చేస్తూ రూపొందించిన నరసింహస్వామి చిత్రం ఆహూతులను విశేషంగా అలరించింది. గురుచిత్ర వెంకటరమణి నృత్య దర్శకత్వం వహించగా, కేఆర్ వెంకటసుబ్రమణియన్ నట్టువాంగం, ఏవీఆర్ రోషిణి మృదంగం, టీవీ సుకన్య గాత్రం, అతుల్ కుమార్ రంగరాజన్ వయోలిన్, ఎస్.అల్బర్ట్ వేణువుపై వాద్య సహకారం అందించారు. మాలతీ కృష్ణ కార్యక్రమ నిర్వహణ చేపట్టారు. గురు చిత్ర వెంకటరమణి దగ్గర ఐదో ఏట నుంచే శిక్షణ పొందిన ఈ చిన్నారులిద్దరూ భరతనాట్యంలో యూనివర్శిటీ ఆఫ్ సిలికాన్ ఆంధ్రా నుంచి లోయర్ డిప్లొమా పట్టాలను పొందారు.

## 92 యేళ్ళ వృద్ధుడికి సన్మానం.



ప్యారీస్, జూలై 15: మాజీ ముఖ్యమంత్రి దివంగత కామరాజర్ 122వ జయంతిని పురస్కరించుకుని అనకాపుత్తూరులో 92 యేళ్ళ వృద్ధుడు మోహన్‌ను సోమవారం ఘనంగా సన్మానించారు. నడిగర్ తిలగం శివాజీ గణేశన్ సంఘ కార్యనిర్వాహక కమిటీ తరఫున సన్మానించారు.